ప్రజాశక్తి

సోమవారం 4 డిసెంబర్ 2023

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు

పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నందున పట్టణ ప్రాంత పేదలను ఆదుకునేందుకు జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్ లో జరిగిన సిపిఎం పట్టణ ప్రాంత సిపిఎం శాఖ కార్యదర్శుల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సంస్కరణలలో భాగంగా పట్టణ ప్రజలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భారాలు వేస్తున్నాయని విమర్శించారు. చెత్త పన్నుతో మొదలుపెట్టి అన్ని రకాల మున్సిపల్ సేవల మీద రాష్ట్ర ప్రభుత్వం చార్జీలు వసూలు చేస్తుందన్నారు. ఒకవైపు కరువు వల్ల పల్లెల్లో పంటలు లేక పనులు లేక పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయన్నారు. ఇంటి బాడుగలు, తాగునీరు, పిల్లల చదువులు, ఆరోగ్యం ఇలా అన్ని రకాల ఆర్థిక భారాలు పట్టణ పేదలపై పడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు, నగదు బదిలీ పథకాలు ప్రజలపై పడుతున్న భారాలకంటే అతి తక్కువగా వున్నాయన్నారు. పట్టణాల్లో పనులు తగ్గిపోయి ఉన్న కొద్ది పనులకే పెద్ద పోటీ నెలకొందని చెప్పారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో ఇతర రాష్ట్రాల కూలీలు పెద్ద సంఖ్యలో పెరుగుతున్నారని దీనివల్ల స్థానికులకు పనులు తగ్గుతున్నాయని అన్నారు. ఆటో హమాలీ లాంటి రంగాల్లో కార్మికుల సంఖ్య పెరుగుతుందని వీరి కుటుంబాల పోషణకు ఆ రంగాలు భరోసా ఇవ్వలేకపోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో పేదలను ఆదుకునేందుకు పట్టణ ప్రాంతాల్లో జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు పేదల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసే మతతత్వ రాజకీయాలను ఎప్పటికప్పుడు ప్రజల నుండి వేరు చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఇందుకోసం అవసరమైన సేవా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్య వైద్యశాలల్లో పనిచేస్తున్న కార్మికులను సంఘటితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి ఆర్వి. నాయుడు, జగన్, అచ్యుత్, మల్లికార్జున, వెంకట నారాయణ, ముస్కిన్, నాగమణి, రాజేశ్వరి, ప్రకాష్, బాబు, గోపాల్, మసూద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అనంత కార్పొరేషన్ 'ఇంపాక్ట్' రాబడికి గండి

ప్రణాళికాధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్న ఇంపాక్ట్

అక్రమ నిర్మాణాలతో కొందరికి ఆదాయం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

నగరంలో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలు పట్టణ ప్రణాళిక అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అయితే అధికారులు అక్రమ నిర్మాణాలు కార్పొరేషన్‌కు రాబడి తెస్తున్నాయంటూ అధికారులు కొత్త భాష్యం చెబుతున్నారు. నగరంలోని సచివాలయాల్లోని ప్లానర్స్ కొందరు ఎల్‌టిపిలు ప్రణాళిక అధికారులతో జోడీ కట్టి కాసుల పంట పండించుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. వీరు పనిలోపనిగా కొంతమంది నేతలను భాగస్వామ్యం చేసుకున్నారన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. అవినీతిపరులైన ఉద్యోగులు తమకు అంటుకున్న మకిలిని నేతలకు అంటిస్తే ఇక తమ జోలికి వచ్చే వారెవరు ఉండరన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారమే కార్పొరేషన్ రాబడిని గండి కొడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరంలో పలు భవంతుల నిర్మాణాలకు అనుమతులు జారీ కావాలంటే తప్పనిసరిగా కప్పం చెల్లించే విధంగా కొందరు ప్లానర్స్ అధికారులకు దళారులుగా మారారన్న విమర్శలు వినపడుతున్నాయి. బిల్డింగ్ ప్లాన్లు 14శాతం బెటర్మెంట్ టాక్స్ కట్టకుండానే భవన నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని నిరోధించాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం చోద్యం చూస్తూ కాసులు దండుకుంటోందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రభుత్వ రాబడి పెంచుకోవడానికి ప్రవేశపెట్టిన ఇంపాక్ట్ స్కీం ప్రణాళిక విభాగానికి కాసుల వర్షం కురిపిస్తుందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. ఇంపాక్ట్ నిబంధనల ప్రకారం 100, 80, 60 అడుగుల రోడ్లలో రోడ్డుకిరువైపులా నిర్మించే నివాసేతర భవనాలకు, 300 మీటర్లు అంతకుమించిన విస్తీర్ణం లో నిర్మించే భవనాలకు మార్కెట్ విలువలో రెండు శాతం వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన అనంతపురం నగరంలో సుభాష్ రోడ్డు, రాజు రోడ్లలో భారీ భవంతుల నిర్మాణం జరుగుతుంది. రాజకీయ పలుకుబడుల కలిగిన వ్యక్తులు ఇంపాక్ట్ ఫీజులు కట్టటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారంటూ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు అధికారులు అనధికారికంగా లోపాయి కారీగా తమ కప్పం కట్టించుకుని మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలు సైతం వినపడుతున్నాయి. దీనిపై గట్టిగా ప్రశ్నిస్తే గత

ఏడాది ఆగస్టులో ప్రభుత్వం జీవో 117ను జారీ చేసిన తర్వాతనే నగర ప్రధాన వీధులలో నిర్మాణాలు చేపట్టారని కొన్నింటికి ముందుగానే భవన నిర్మాణ అనుమతులు పొందారని ప్రణాళిక అధికారులు చెబుతున్నారు. ఈ తతంగం ఇంపాక్ట్ ప్రణాళిక అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. ఏకచత్రాధిపత్యం చెలాయిస్తున్న ఉద్యోగులు వాహనాలలో వెళ్లి ఇంపాక్ట్ ఫీజు కన్నా తమ స్వంత ఫీజులు వసూలు చేసుకోవడం పైనే దృష్టి సారించారన్న ఆరోపణలు సైతం వినపడుతున్నాయి. ఇందుకు సచివాలయాల ప్లానర్స్‌ను రంగంలో దించి ప్రణాళిక అధికారులు తమ ఇంపాక్ట్‌ను ప్రదర్శిస్తున్నట్టు భవన నిర్మాణదారులు గుసగుసలు పోతున్నారు. ఈ విషయంలో తాము గట్టిగా నిలదీస్తే భవనాలు నిర్మాణాలకు అడ్డంకులు ఏర్పడతాయని వారు భయపడుతున్నట్లు సమాచారం. ఈ అవకాశాన్ని ప్రణాళిక అధికారులు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాజు రోడ్డులో ఒకదాని పక్కన మరొకటి భారీ భవంతుల నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటిలో ఒక భవనం అర్బన్ నియోజకవర్గ ముఖ్యనేత సంబంధికులది కావడం గమనార్హం. దీంతో వారి జోలికి వెళ్తే తమ గుట్టు రట్టు అవుతుందన్న భయంతో అధికారులు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. ఈ లోగోట్టు వ్యవహారం బయటికి తెలియకుండా ఉండేందుకు 60 అడుగుల రోడ్డులో ఉన్న ఆ భవనం ఇంపాక్ట్ పరిధిలోకి రాదని ఉద్యోగ వర్గాలు కొత్తపల్లవి అందుకున్నాయి. అలాగే దాని ప్రక్కన బిల్డింగ్ ప్లాన్ జారీ సమయంలోనూ నిర్దేశిత కొలతలు లేవంటూ తొలుత బిల్డింగ్ అనుమతులు జారీ చేయకుండా కొన్ని

నెలలు పెండింగ్‌లో పెట్టారు. దాని వెనుక భాగంలోని స్థల యజమాని రూ. 80 లక్షల పైగా సొమ్ము చెల్లించిన తర్వాతనే బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి మార్గం సుగమమైనట్లు సమాచారం. ఈ భవన యజమానితో సైతం ఇంపాక్ట్ ఫీజులను తక్కువగా వసూలు చేసిన అధికారులు వారు తమ స్వంత ప్రయోజనం ఎక్కువ పొందినట్లు సమాచారం. ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలో ఇంపాక్ట్ ఫీజుల పరిధిలోకి వచ్చే భవనాలు ఎన్ని ఉన్నా వాటి నుంచి వసూలు చేయడం కన్నా తమ ప్రయోజనాలే మిన్నగా ఉద్యోగ వర్గాలు వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. అధికారికంగా అన్ని సక్రమంగా ఉంటే నిర్భయంగా వాస్తవ గణాంకాలను వసూలైన ఇంపాక్ట్ ఫీజుల వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది అయితే ఆ వివరాలను బహిర్గతం కానివ్వకుండా లోగోట్టు వ్యవహారాలను ప్రణాళిక అధికారులు నడపటం చూస్తే లోగోట్టు పెరుమాళ్ళ కెరుక అన్న నానుడి తేట తెల్లం అవుతోంది. పట్టణ ప్రణాళిక విభాగంలో ఇటీవలనే డీసీపీ ఏసీపీ బదిలీపై వచ్చి చేరారు. వారు రాక మునుపు నుంచి ప్రణాళిక విభాగాన్ని ఏలుతున్న ఒకరిద్దరు ఉద్యోగులు మాత్రమే ఇందులో పాలుపంచుకుంటున్నారు. వీరిని ప్రశ్నించాల్సిన ఉన్నతాధికారి సైతం వారి పట్ల ఉదాసీనత చూపుతుండటాన్ని బట్టి ఏదో మతలబు జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కు బదిలీ చేసిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌ను జాయిన్ చేసుకోకుండా ఓడీ బేస్ లో ఆన్ డ్యూటీ పద్ధతిలో మరో మున్సిపాలిటీలో పనిచేయిస్తూ ఇక్కడ వేతనం తీసుకునేలా చేయటంలో ఉన్నతాధికారి ఆంతర్యం ఏమిటో పాలకవర్గానికే తెలియాలి.

ప్రభుత్వం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు, రాష్ట్ర ఖజానాకు ఆదాయం వచ్చేందుకు ఎన్నో మార్గాలు వెతుకుతుంటే అదే స్థాయిలో వాటికి తూట్లు పొడిచే మార్గాలు వెతకడంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారి, పట్టణ ప్రణాళిక విభాగం తమవంతు చర్యలు చేపట్టారన్న విమర్శలు వినపడుతున్నాయి. అవినీతి అధికారులను ఒకరిద్దరిని సమీక్షల్లో కమిషనర్ గద్దించటం మినహా క్రమశిక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో వారు ఆడింది ఆట పాడింది పాటగా తయారైందన్న వ్యాఖ్యానాలు వినపడున్నాయి. ఇప్పటికైనా నగర పాలకసంస్థ అధికారులు, పాలకులు స్పందించి ఇంపాక్ట్ పనితీరులో మార్పు తీసుకురావాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రాయదుర్గం : మండలంలోని వడ్రవన్నూరు, 74- ఉడేగోళం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓబులేసు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల్లో ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు సవరణలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆదివారం 385 దరఖాస్తులు రాగా 252 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంత్రి ఉషాశ్రీ చరణ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విభిన్న ప్రతిభా వంతుల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందనిరాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి. ఉషాశ్రీచరణ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎస్‌బిఎన్ కళాశాల ఆవరణంలోని రూసా అడిటోరియంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం జిల్లా,రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడలలో ప్రతిభ కనబరిచిన విభిన్న ప్రతిభావంతులకు మంత్రి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. అదే విధంగా వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా చేయాల్సింది ఉంది...

జనవరి మొదటి వారంలో స్నాతకోత్సవం

'అనంత'జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అనుకున్న దానిలో కొంత వరకు చేయగలిగాను...ఇంకా చేయల్సింది చాలానే ఉంది.' అని అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రంగ జనార్ధన్ పేర్కొన్నారు. తాను వైస్‌చాన్సలరుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విశ్వవిద్యాలయంలో తీసుకొచ్చిన మార్పులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలియజేశారు.

ప్రశ్న : ఉద్యోగ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించండి ?

విసి : వైస్ చాన్సలరుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విశ్వవిద్యాలయాన్ని అన్ని విభాగాల్లో ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేశాను. ర్యాంకింగులో ఇప్పుడు అనంతపురం జెఎన్‌టియు వెయ్యిలోపు వచ్చేసింది. గతంలో వెయ్యిపైన ఉండేది. అదే విధంగా అన్ని విభాగాలకు ఎన్‌బిఎను సాధించగలిగాం. నాక్ సాధించేందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టాం. త్వరలోనే అది కూడా వస్తుందని భావిస్తున్నాం.

ప్రశ్న : పరిశోధనలు, విద్యాబోధనలో ఏమైనా మార్పులు తీసుకొచ్చారా ?

విసి. అవును విద్యాబోధన, పరిశోధనల పెంపుదలకు చర్యలు చేపట్టగలిగాం. ప్రధానంగా పరిశోధనలు పెంచేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా జూనియరు అధ్యాపకులను ప్రోత్సహించేందుకుగానూ లక్ష రూపాయల సీడెడ్ ఫండ్‌ను కేటాయించాం. తద్వారా ముందుగా వారు పరిశోధనలపై ఆ నిధులతో దృష్టి సారించేందుకు వీలుంటుంది. ఆ తరువాత సంస్థలు ముందుకొచ్చి నిధులు కేటాయిస్తే వీటిని మరింత పెంచేందుకు వీలుంటుందని ఆ నిర్ణయం తీసుకున్నాం. విద్యాబోధనలోనూ అనేక మార్పులు తీసుకొచ్చాం. సాధారణంగా ఉండే సబ్జెక్టులతోపాటు ఆసక్తివున్న ఇతర సబ్జెక్టులను విద్యార్థులు అభ్యసించే విధంగా మార్పులు చేపట్టాం. అదే విధంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే కార్యక్రమాలు తీసుకొచ్చాం.

ప్రశ్న :మీ హయంలో మౌళిక సదుపాయలను ఏమైనా మెరుగు పరిచే చర్యలు తీసుకున్నారా ?

విసి : మౌళిక వసతులు కొన్ని పెంచగలిగాం. నూతన పరిపాలనా భవనం, కంప్యూటర్ సైన్సు విభాగం, లెక్చరర్ కాంప్లెక్సు, ఇండోర్ స్టేడియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఐదు నూతన భవన నిర్మాణాలను రూ.85 కోట్లతో చేపట్టాం. దాదాపు అన్నీ పూర్తికావచ్చాయి. వీటిని జనవరి రెండవ వారంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని భావిస్తున్నాం.

ప్రశ్న :రెండు సంవత్సరాలుగా స్నాతకోత్సవం జరగలేదు. 13వ స్నాతకోత్సవం ఎప్పుడు జరగవచ్చు ?

విసి : త్వరలోనే స్నాతకోత్సవం నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఛాన్సలర్ అయిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీనర్‌గారిని కలిశాం. ఆయన జనవరి మొదటి వారంలో సమయమిచ్చి ఉన్నారు. ఆయన తేదీ ఖరారు చేసిన వెంటనే 13వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నాం. ఇప్పటికే నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశాం. ఏర్పాట్లూ జరుగుతూ ఉన్నాయి.

ప్రశ్న : త్వరలో పదవీకాలం పూర్తికావస్తోంది.. మొత్తంగా ఈ బాధ్యతలు ఏ మేరకు సంతృప్తినిచ్చాయి ?

విసి : చాలా వరకు సంతృప్తికరంగానే ఉంది. అనుకున్న దానిలో కొంత వరకు చేయగలిగాం. ఇంకా చేయాల్సింది చాలానే ఉంది. అనంతపురం జెఎన్‌టియుకి ఒక సుదర్ఘమైన చరిత్ర ఉంది. అందుకు తగ్గట్టు మరిన్ని మార్పులు తీసుకురావాల్సి ఉంది. అనంతపురం జెఎన్‌టియుతో ముందు నుంచి అనుబంధముంది. దీని అభివృద్ధికి ఎళ్లవేళలా కృషి చేసే ప్రయత్నం చేస్తాను.

అనంత జెన్‌టియు విసి రంగజనార్ధన్

ఫిబ్రవరి 2 నుంచి అనంత బాలోత్సవం

విద్యార్థులు ముందస్తు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి

బాలోత్సవం సన్నాహక సమావేశంలో నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న షమీమ్ షఫీవుల్లా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లల పండుగ అనంత బాలోత్సవాలు 2024 ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అనంత బాలోత్సవ కమిటీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో అనంత బాలోత్సవం-4 సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. అనంత బాలోత్సవ కమిటి కార్యదర్శి పి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అనంత బాలోత్సవ కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి మహమ్మద్ జిలాన్, కమిటీ సభ్యులు లింగమయ్య, సుబ్బరాయుడు, ప్రజ్ఞా సురేష్, పొట్లూరి హరిక్రిష్ణ, మధురశ్రీ, ఎజి.రాజమోహన్, విజయసాయి కుమార్, ఓ.నల్లప్ప తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనంత బాలోత్సవాలు ప్రత్యేకతను చాటుకున్నాయని, పిల్లల మానసికోల్లాసానికి, విజ్ఞాన వికాసానికి దోహదపడుతున్నాయని తెలిపారు. మూడు పర్యాయాలు బాలోత్సవాలు నిర్వహించామని, నిర్వహణలో ఏ ఏడాదికి ఆ ఏడాది లోటుపాట్లు సరిచేసుకుంటూ నిర్వహిస్తున్నామని చెప్పారు. ముందస్తుగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆ మేరకు పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఈవిషయంలో కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్లతో సమస్యలు ఉత్పన్నమవుతూ నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కావున ముందస్తుగానే ఏ ఈవెంట్స్‌లో పాల్గొంటారో స్పష్టం చేస్తూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిర్వహణ బాధ్యతలను కమిటీ ఏదీ అప్పగించిన వారు సజావుగా పూర్తి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామంటూ హాజరైన సభ్యులు తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఫిబ్రవరి 2, 3,4 తేదీల్లో అనంతపురం నగరంలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏదో ఒక చోట బాలోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత బాలోత్సవాల్లో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా వాటిని సవరించుకుని విజయవంతంగా నిర్వహించేందుకు పలువురు సూచనలు సలహాలు అందించారు. వారోత్సవాలు విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం-4 కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్, డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర, నారాయణనాయక్, శివారెడ్డి, షేక్ రియాజుద్దీన్, ఓన్నూర్‌కుమార్, అనిల్, శ్రీనివాసులు, నాగమణి, పల్లవి, రోహిణి, లక్ష్మీనారాయణ, శ్యామల, రాజేశ్వరి, తాడేపల్లి రామకృష్ణ, ఎంఎస్‌టి.రాజు, బాలరంగయ్య, సురేంద్ర, నిసార్ అహమ్మద్, లక్ష్మీనారాయణ, బిహెచ్.రాయుడు, దేవేంద్రమ్మ, జూటూరు షరీఫ్, పరమేష్, క్రిష్ణవేణి, రవిచంద్ర, ఎల్ఆర్.వెంకటరమణ, రామాంజినమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డును అందుకున్న పుట్టపర్తి వాసి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం జరిగిన ప్రతిష్టాత్మక వేడుకల్లో దివ్యాంగజన్ 2023 సాధికారత కోసం జాతీయ అవార్డును పుట్టపర్తికి చెందిన సాయి కౌస్తువ్ దాస్‌గుప్తాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రదానం చేశారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత రాష్ట్ర మంత్రులు రాందాస్ అథవాలే, ఎ. నారాయణస్వామి, ప్రతిమా భూమిక్ తదితరులు పాల్గొన్నారు. భారతదేశపు వీల్ చైర్ వారియర్ యాక్సెసిబిలిటీ, ఇన్‌క్లూజన్ రంగంలో తన అసాధారణమైన సహకారానికి గుర్తింపు పొందిన దాస్‌గుప్తా గ్లోబల్ టెడ్ ఎక్స్ మోటివేషనల్ స్పీకర్, 90 శాతం లోకోమోటర్ వైకల్యం ఉన్న వ్యక్తి. ఈయన దివ్యాంగజన్ విభాగంలో వ్యక్తిగత నైపుణ్యానికి జాతీయ అవార్డును అందుకున్నారు. ఆస్టియోజెనిసిస్ ఇంపెర్ఫెక్టా, చాలా అరుదైన పెళుసు ఎముక వ్యాధి, తీవ్రమైన వినికిడి లోపం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ సాయి కౌస్తువ్ నాయకత్వ లక్షణాలతో ప్రపంచ చిహ్నంగా ఎదిగారు. అతని సానుకూల దృక్పథం, నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా విభిన్న ప్రేక్షకులపై శాశ్వత ప్రభావాన్ని చూపాయి. గిన్నిస్, లిమ్కా వరల్డ్ రికార్డులు కలిగి ఉన్న దాస్‌గుప్తా ఇప్పటి వరకు వివిధ వేదికలపై 500 పైన అవార్డులను అందుకున్నారు. ఆయన జీవిత కథ లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది.

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాయి కౌస్తువ్ దాస్ గుప్తా

ప్రజాశక్తి కథనానికి స్పందన

నేరాలపై సైబర్‌క్రైమ్ సిఐ విచారణ

ప్రజాశక్తి-గుత్తి

ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'పెట్రేగుతున్న సైబర్ నేరగాళ్లు' అనే కథనానికి స్పందన లభించింది. సైబర్ క్రైమ్ అనంతపురం సిఐ షేక్ జాకీర్ ప్రజాశక్తితో ఫోన్‌లో సంభాషించారు. బాధితుల ఫోన్ నెంబర్లు, వివరాలను సేకరించారు. ఆధార్ ఎనాబుల్డ్ పేమెంట్ సిస్టం (ఎఇపిఎస్) ద్వారా మోసపోయిన బాధితులను విచారించి గుత్తి మండలవ్యాప్తంగా 30 మంది బాధితుల కేసులను నమోదు చేసినట్లు సైబర్ క్రైమ్ సీఐ తెలిపారు. సైబర్ నేరాల ద్వారా నగదును మోసపోయిన వారికి 90 రోజుల్లోపు ఖాతాలకు పోయిన సొమ్ము జమ అవుతుందని చెప్పారు. గతంలోని 19 మంది సైబర్ నేరాలకు గురైన బాధితులకు వారి ఖాతాలకు నగదు జమ అయిందన్నారు. అలాగే స్థానిక పట్టణానికి చెందిన బాధితులు గ్రానైట్ వ్యాపారి ఎం.రామాంజనేయులు భార్య ఎం.లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదుపై సైబర్ నేరం కేసును పోలీసులు నమోదు చేశారు.

అసాంఘిక కార్యపాలకు పాల్పడితే చర్యలు

డీఎస్పీ నర్సింగప్ప

ప్రజాశక్తి-బెలుగుప్ప

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింగప్ప

ఎవరైనా అసాంఘిక కార్యన్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నర్సింగప్ప హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని లాకప్ గదలను కంప్యూటర్ గదలను పరిశీలించారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిసరాల్లోని ప్రాంతాలతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం కేసుల దర్యాప్తుపై స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గుండ్లపల్లి క్రాస్, బ్రాహ్మణపల్లి, కాలువపల్లి ఏరియాల్లో బ్లాక్ స్పాట్స్‌పై తీసుకున్న చర్యలపై పోలీస్ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక స్టేషన్‌లో బదిలీపై వెళ్లిన పోలీసుల స్థానంలో కొత్త పోలీసులను భర్తీ చేయలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు త్వరలోనే ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐ రాందాస్, హెడ్ కానిస్టేబుల్ బాల నరసింహులు, శివశంకర్‌నాయక్, మల్లికార్జున, శ్రీనివాసులు, పోలీసులు గోపీ, రవి, నాగభూషణ, రాజునాయక్, నాగభూషణ, మహిళా కానిస్టేబుల్ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

ఉండబండ మల్లికార్జున స్వామికి ప్రత్యేకపూజలు

ప్రజాశక్తి-ఉరవకొండ

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు మండలంలోని ఉండబండ గ్రామంలో వెలసిన భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెల్లవారుజాము నుంచే భ్రమరాంభ సమేత మల్లేశ్వర స్వామి మూలవిరాట్‌కు, గణపతి, ఉమామహేశ్వర, నవగ్రహ, అష్టదిక్పాలక మూర్తులకు మహారుద్రాభిషేకం, సహస్రార్చన, అలంకారయుక్త మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం, హోమ హవనాదులు, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో బాళేహొన్నూరు మఠ్రంభాపురి జగద్గురువు డా.వీరసోమేశ్వర రాజదేశికేంద్ర శివాచార్యులను అడ్డపల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం కమణీయంగా సాగింది. ఈ కార్యక్రమంలో వీరభద్ర శివాచార్య స్వాములు, సిద్ధరబెట్ట క్షేత్రం, మహేశ్వరస్వామి, కల్యాణ మహాస్వామి, కళ్యాణస్వామి చన్నవీర శివాచార్యస్వామి, అభినవ శివలింగేశ్వర రుద్రముని శివాచార్య స్వామి, శరణనందగిరి మాతాజీ, విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి, నాయకులు కరణం భీమరెడ్డి, సర్పంచి సుమంగళమ్మ, ప్రకాష్‌గౌడ్, రాజన్నగౌడ్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, ఓబుళప్ప, పెద్ద తిప్పయ్య, గోవిందు, వడ్డే ఆంజనేయులు, హంపయ్య, పాల్తూరు షన్ముఖ్‌గౌడ్, శంకర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా టపాసులు కాల్చుతూ, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రరమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఛైర్మన్ దాదాగాంధీ, సిపిఐ నాయకులు జగదీష్, జిల్లా అధ్యక్షులు జాఫర్, సెక్రటరీ నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు కాపు గాజుల వాసు, రాష్ట్ర నాయకులు కడియాల ఫక్రుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎండి ఇమామ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రామ్‌చరణ్‌యాదవ్, గార్లదిన్నె మండల కన్వీనర్ ఓబిరెడ్డి, శింగనమల మండల కన్వీనర్ బండి రామాంజనేయులు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేష్, నగర అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ, రాయదుర్గం, పుట్లూరు, శింగనమల మండలాల్లో కూడా కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

ప్రశాంత జీవనం గడపాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

మండలం వ్యాప్తంగా ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ శరత్‌చంద్ర సూచించారు. ఆదివారం మండల పరిధిలోని చిన్న యక్కలూరు, దేవుని ఉప్పలపాడు, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని రౌడీషీటర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నవి ఎన్నికల రోజులు కావున గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీరు ప్రశాంతంగా జీవిస్తే మీ కుటుంబం, పిల్లలు ప్రశాంతంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

శింగనమల : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్ సెంటర్‌లో కంటి వైద్యులు డాక్టర్ ప్రసాద్, జన్ సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితం మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 52 మంది కంటి రోగులు ఆపరేషన్ చేయించుకునేందుకు కడప పట్టణంలోని పుష్పగిరి ఆసుపత్రికి తరలించినట్లు కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానము
మురడి గ్రామము, డి-హిరేహాళు మండలం, అనంతపురం జిల్లా.

ధర్మకర్తల మండలి నియామకము కొరకు ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా అనంతపురం జిల్లా డి-హిరేహాళు మండలం మురడి గ్రామములో యున్న శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానమునకు గాను దేవాదాయ-ధర్మదాయ శాఖ చట్టము 30/87 మరియు సవరణ చట్టము 20,31 ఆఫ్ 2019 & 3 ఆఫ్ 2023 పరిచ్ఛేదము ప్రకారము జి.ఓ.ఎం.ఎస్.నెం.522 రెవెన్యూ (ఎండోమెంట్-I) డిపార్టుమెంట్ తేది:27/08/2021 ప్రకారము ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 20 రోజుల అనంతరము ధార్మిక పరిషత్ వారు ధర్మకర్తల మండలి నియామకము చేసెదరు.

కావున ఆసక్తిగల అభ్యర్థులు ధర్మకర్తల నియామకము కొరకు ఈ నోటీసు ప్రచురించి 20 రోజులలోపు దేవాదాయశాఖ చట్టము 17 (3) నందు గల నిబంధనలలో పేర్కొనబడిన నమూన ఫారం-II ద్వారా శ్రీయుత ఉప కమీషనరు, దేవాదాయ శాఖ కర్నూలు వారికి దరఖాస్తులు పంపవలెను.

సం/-పి.గురుప్రసాద్, ఉప కమీషనరు (ఎఫ్.ఎ.సి)
దేవాదాయ ధర్మదాయ శాఖ, కర్నూలు

మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ నాయకులు కె.నాగభూషణ, ఎటిఎం నాగరాజు కోరారు. ఈమేరకు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో దాదాపు 800పైగా పనిచేస్తున్నారన్నారు. ఇదివరకే అనంతపురం రూరల్ ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలో మున్సిపల్ కార్మికులందరూ గుట్టలో జెండాలు నాటి చెట్లు, కంపలు, ముళ్లపొదలను శుభ్రం చేసుకున్నారన్నారు. కావున ఆ స్థలాలను మున్సిపల్ కార్మికులకి కేటాయించాలని కోరుతూ సంబంధిత భూమి వివరాలను అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత భూమి వివరాలను పూర్తిగా తీసుకుని మున్సిపల్ కార్మికులందరికీ వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆర్డీటీ అండర్-11 మిక్స్‌డ్ జెండర్ సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

క్రీడాకారులతో అధ్యాపకులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ అండర్-11 మిక్స్‌డ్ జెండర్ సాఫ్ట్‌బాల్ జోన్-4 క్లబ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రాస్ రూట్ లెవెల్ కో ఆర్డినేటర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 20 క్లబ్బులు ఏర్పాటు చేసి నాలుగు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించామన్నారు. వీరిలో విన్నర్స్, రన్నర్స్‌ను జిల్లాస్థాయి, సెంట్రల్, జోన్ లెవెల్‌కు అర్హత సాధించిన వారికి ఈనెల 9,10వ తేదీల్లో ఆర్డీటీ అనంత క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో బుక్కరాయసముద్రం క్లబ్, కడవకల్లు క్లబ్, కళ్యాణదుర్గం క్లబ్, అనంత క్లబ్, నార్పల క్లబ్ జట్లు పోటీపడ్డాయి. వచ్చిన క్రీడాకారులకు పీడీ గోపాల్‌రెడ్డి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈవో వెంకటేశులు, అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, బుక్కరాయసముద్రం పీడీ గోపాల్‌రెడ్డి, అఫీషియల్స్ సింహాద్రి, శివ, షాకీర్, మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, ఉపాధ్యాయ బృందం సాఫ్ట్‌బాల్ సభ్యులు వెంకటేశులు, నాగేంద్ర, బుక్కరాయసముద్రం క్లబ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. టిడిపి బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొరాళు ధనార్జన ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 28వ ఎన్నికల వార్డులో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. అంతేగాకుండా గత ప్రభుత్వంలో చేనేత కార్మికులతోపాటు గార్మెంట్ పరిశ్రమకు నిరంతర విద్యుత్ ఇచ్చేవారన్నారు. అంతేగాకుండా అనేక గృహ నిర్మాణాలు కూడా చేపట్టారని గుర్తు చేశారు. అనంతరం టిడిపి మినీ మేనిఫెస్టోలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు ఎర్రిస్వామి, బీసీ నాయకులు రాజశేఖర్, గోవర్ధన్, మహేష్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం మండలంలో కార్యకర్తలతో శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం : మండలంలోని కొండాపురం గ్రామంలో 'బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కరెంటుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ ఎఇ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల

మీచాంగ్ తుఫాన్ నేపథ్యంలో వర్షాలు కురువనున్న నేపథ్యంలో మండలవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల విద్యుత్ శాఖ ఎఇ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తుఫాన్ కారణంగా వర్షాలతోపాటు ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున రైతుల కరెంట్ మోటార్లు మునిగి, స్టార్టర్లు, డబ్బాలు తడిసిపోయే అవకాశం ఉన్నందువల్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మోటార్ల వద్దకు వెళ్లిన వెంటనే వైర్లు, స్టార్టర్లను ముట్టుకోరాదన్నారు. అలాగే వెలాడే ఇనుప తీగలు, కరెంట్ స్తంభాలు, ఇనుప స్తంభాలు, లైన్స్ మీద చెట్టు కొమ్మలు పడినా, ముట్టుకునే ప్రయత్నం చేయరాదన్నారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చేటప్పుడు, వాహనాల్లో వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఉన్నా, తీగలు తెగినా, పోల్స్ పడిపోయినా, మీ లోకల్ లైన్ ఇన్స్‌పెక్టర్‌కుగానీ, లైన్‌మెన్‌కుగానీ, సబ్‌స్టేషన్లకు గానీ, 1912కుగానీ తెలియజేయాలని కోరారు.

ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వం

గుత్తి : సామాన్యులపై వైసీపీ ప్రభుత్వం దశభారాలను మోపుతోందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాలను అమలు చేస్తున్న ప్రభుత్వం అనేక మెలికలు పెట్టి అర్హులను అనర్హులుగా చేస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుత్తి మున్సిపాలిటీలో సమస్యలు తాండవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి తాగునీటిని సరఫరా చేయలేకపోతున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, సహాయ కార్యదర్శి రాజు, పట్టణ సహాయ కార్యదర్శి షేక్ నజీర్, నాయకులు నరసింహయ్య, పూలమాబు, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవానికి హాజరైన బలిజలు

ఉల్లాసంగా బలిజల వనమహోత్సవం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయల వేషధారణ.. మహిళల కోలాటం.. నృత్యాలతో బలిజలు వన భోజన మహోత్సవం ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది. అనంతపురం సమీపంలోని సోములదొడ్డి వద్ద ఉన్న తడకలేరు అశ్వర్థనారాయణస్వామి ఆలయం వద్ద నిర్వహించిన వన భోజన మహోత్సవానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బలిజలు భారీగా తరలివచ్చారు. ఇందులో భాగంగా పాటల కచేరీ కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షులు పాముదాయి వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు పద్మజ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బలిజ కులస్తులు భారీగా తరలివచ్చి వన మహోత్సవాన్ని విజయవంతం చేశారన్నారు. రాబోవు రోజుల్లో బలిజలు రాజకీయంగా ఎదుగుదల, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు నిత్యభారతి, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు దరఖాస్తు చేసుకోండి

శింగనమల : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ నిర్మలకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా లోలూరు గ్రామ సచివాలయం పరిధిలో ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు 15ఏళ్ల నుంచి యువతీ, యువకులు ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక పూజలు

నార్పల : మండలంలోని నడిమిదొడ్డి గ్రామం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక దీపారాధన సందర్భంగా అన్నదానం చేశారు. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. నడిమిదొడ్డి, గడ్డంనాగేపల్లి గ్రామాల ప్రజలతోపాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అలయ అర్చకులు శంకరయ్య, నారమ్మ దంపతులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యను అందించాలి

ఉరవకొండ : గుణాత్మకమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మాలాపురంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఎంపీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బందిని భోజనంపై ఆరాతీశారు. తర్వాత విద్యార్థినులతో భోజనం రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నారా.. పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయా.. అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గిరిబాబు, హంపయ్య, సత్తి, తదితరులు ఉన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ఘనంగా గ్యార్మీ పండుగ

గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పామిడి : మండల కేంద్రంలో గ్యార్టీ పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పామిడి ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలో ఉన్న మహబూబ్ సుబానీ జెండా కట్ట దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ సి.బి.మంజునాథరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

మృతిచెందిన అలియా, రోధిస్తున్న తల్లిదండ్రులు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక మరణించింది. తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుత్తి పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన భాష, కుల్లాయమ్మ దంపతుల కుమార్తె అలియా (8) తల్లిదండ్రులతో కలిసి నానమ్మ ఊరు పెద్దవడగూరు మండలం వెంకటాంపల్లికి ఆటోలో బయలుదేరారు. ఆటో డ్రైవర్ అయినా తన తండ్రి దగ్గర ఉన్న సీటులో కూర్చున్న అలియా కొత్తపేట గ్రామం వద్ద 67 జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన బాలికను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అలియా మరణించినట్లు నిర్ధారించారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమార్తె మరణంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మహిళ ఆత్మహత్య

మృతిచెందిన మహబూబ్‌బి

రాయదుర్గం : పట్టణంలోని కోతిగుట్ట ప్రాంతంలో నివాసం ఉండే సుకుమార్ భార్య మహబూబ్ బి (రేష్మ) (31) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త రెడీమేడ్ గార్మెంట్ పని చేసుకుని జీవించేవాడు. వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకోవడంతో ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త సుకుమార్ పని సక్రమంగా వెళ్లకపోగా తాగుడుకు అలవాటు పడ్డాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈనేపథ్యంలో మనస్పర్థలు కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలదాడిలో చిన్నారికి గాయాలు

గాయపడిన చిన్నారి సల్మాన్

బుక్కరాయసముద్రం : వీధి కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి ఘటన ఆదివారం గ్రామ పంచాయతీలోని జన చైతన్యనగర్‌లో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ షఫీ కుమారుడు షేక్ మహమ్మద్ సల్మాన్ (18 నెలలు)ను వీధి కుక్క కరవడంతో తీవ్రంగా గాయపడింది. పిల్లవాడు గట్టిగా అరవడంతో స్థానికులు వచ్చి కుక్క బారి నుంచి రక్షించారు. అంతేగాకుండా వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇకపోతే జన చైతన్య నగర్‌లో కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోయారు. ఇప్పటికే చాలామంది పిల్లలు, వృద్ధులు, మహిళలు కుక్కల దాడులకు గురయ్యారన్నారు. కుక్కులను నివారించాలని అధికారులకు విన్నవించినా పట్టించకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

టిటిడి బోర్డు మెంబర్ అశ్వర్థనాయక్‌ను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

గిరిజన ఉద్యోగులపై దాడులు అరికట్టాలి

ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి.రమణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో గిరిజన ఉద్యోగులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి.రమణ అన్నారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో రాయలసీమ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.అశోక్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు పివి.రమణ, రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్యనారాయణ హాజరై మాట్లాడారు. గిరిజన ఉద్యోగులపై దాడులు పెరుగిపోయాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్‌పై ఏసిబి అధికారులు దాడులు చేసి ఆందోళనకు గురి చేశారని, దిక్కు తోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గిరిజన ఉద్యోగులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురువుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్ మృతిపై సిబిసిఐడితో దర్యాప్తు చేయించి వాస్తవాలను వెల్లడించాలన్నారు. శ్రీనివాసులు నాయక్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, కుటుంబానికి పూర్తి పెన్షన్ అందేలా చూడాలన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదన్నారు. పార్లమెంట్‌లో వచ్చే శీతాకాల సమావేశంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు బిల్లు పెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి సంతకాల సేకరణ పత్రాలు అందజేసి నిరసన తెలిపామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజన ఉద్యోగులకు ప్రాధాన్యత పోస్టుల్లో నియమించి రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్‌లను ఏకగ్రీంగా సమావేశం తీర్మాణించింది. అనంతరం టిటిడి పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన అశ్వర్థనాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు వైపి.నాగభూషణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటరమణ నాయక్, అనంతపురం ఛైర్మన్ ఠాగూర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రామానాయక్, ప్రధాన కార్యదర్శి డి.రామాంజినేయులు, ఉపాధ్యక్షులు ఎస్.గోపాల్ నాయక్, చెన్నకేశులు, వెంకటనారాయణ, మహిళా అధ్యక్షురాలు శాంతాబాయి, సుగుణాబాయి, సుశీల బాయి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌నాయక్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, జాయింట్ సెక్రటరీ ఆర్.నాగరాజు, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గుత్తి : భారత మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని గుత్తిలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె.అబుబకర్, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు నారాయణ శెట్టి, నారాయణరెడ్డి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.